సీఎం పర్యటన.. పెదగదిలిలో సందడి


ముఖ్యమంత్రి కాన్వాయ్ వైపు తిరిగి జై జగన్ అంటూ చేతులు ఊపుతున్న అభిమానులు


అపోలో ఆస్పత్రి వద్ద సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని చూడడానికి రోడ్డు పక్కన నిరీక్షిస్తున్న స్థానికులు

ఆరిలోవ: పెదగదిలిలో గురువారం సందడి నెలకొంది. హెల్త్ సిటీలోని అపోలో ఆస్పత్రిలో క్యాన్సర్ విభాగం ప్రారంభించడానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గురువారం సాయంత్రం 5 గంటలకు రావడంతో రాజకీయ నాయకులు, ప్రజాప్రతినిధుల కోలాహలం కనిపించింది. ఇక్కడ రోడ్డుకు ఇరుపక్కలా ముఖ్యమంత్రి ఫొటోలతో ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలు ఆకట్టుకున్నాయి. సీఎం పర్యటన విషయం తెలుసుకున్న స్థానికులు, ఆరిలోవ ప్రాంతీయులు పెద్ద సంఖ్యలో అక్కడకు సాయంత్రం 4 గంటలకే చేరుకుని రోడ్డు పక్కన నిరీక్షించారు. భద్రత చర్యల్లో భాగంగా పోలీసులు స్థానికులను ఎవరినీ ఆస్పత్రి లోపలకు వెళ్లనీయకుండా జాగ్రతలు పాటించారు. ముఖ్యమంత్రి కాన్వాయ్ రాగానే అక్కడ ఉన్న జనం 'జై జగన్, జగనన్నకు స్వాగతం' అంటూ నినాదాలు చేశారు. ఇదిలా ఉండగా ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి కాన్వాయ్ వెళ్తుండగా పెదగదిలి కూడలి వద్ద వానపల్లి పార్వతి అనే ఓ మహిళ నా కుమారుడిని రక్షించు జగనన్నా అంటూ పెద్ద కేకలు వేసింది. ఆ పిలుపు విన్న ముఖ్యమంత్రి కారు ఆపి కిందకు దిగారు. ఆమె కుమారుడి ఓపెన్ హార్ట్ సర్జరీకి అయ్యే ఖర్చంతా ప్రభుత్వమే భరిస్తుందని సీఎం భరోసా ఇచ్చారు. వెంటనే పక్కనసే ఉన్న కలెక్టర్ మల్లికార్జునకు బాలుడి గుండె ఆపరేషన్ బాధ్యతలు అప్పగించారు. దీంతో అక్కడ ఉన్న స్థానికులు జై జగన్, పేదల దేవుడు జగన్ అంటూ నినాదాలు చేశారు.

అధినేతకు ఆత్మీయ స్వాగతం



విశాఖ నగర పర్యటనకు గురువారం విచ్చేసిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ఎమ్మెల్సీలు వంశీకృష్ణ శ్రీనివాస్, వరుదు కల్యాణి పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు.

క్లుప్తంగా

నేటి నుంచి ఫ్యాబ్రిక్ పెయింటింగ్‌పై ఉచిత శిక్షణ

మద్దిలపాలెం: వేసవి సెలవులను సద్వినియోగం చేసుకోవడానికి బాల వికాస్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఫ్యాబ్రిక్ పెయింటింగ్ వర్క్‌షాప్‌ను శుక్రవారం నుంచి నిర్వహించనున్నామని బాల వికాస్ ఫౌండేషన్ వ్యవస్థాపక కార్యదర్శి నరవ ప్రకాశరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఫెవిక్రిల్ సంస్థ సహకారంతో ఈ నెల 12 నుంచి ఐదు రోజుల పాటు వర్క్‌షాప్ నిర్వహించనున్నామని పేర్కొన్నారు. ప్రతి రోజు ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకూ వర్క్‌షాప్ నిర్వహిస్తామన్నారు. నార్త్ ఎక్స్‌టెన్షన్‌లో గల శ్రీకృష్ణ మందిరంలో గురువాయూరప్ప ఆవరణలో వర్క్‌షాప్‌ను ఏర్పాటు చేశామన్నారు. ఆసక్తి గల మహిళలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. పూర్తి వివరాల కోసం 85200 04288 ఫోన్ నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

వేషధారణ పోటీల్లో మురళికి ప్రథమ స్థానం


మురళికి బహుమతి అందిస్తున్న పీతల గోవింద్

బీచ్ రోడ్డు: శివాజీపాలెం పోలమాంబ అమ్మవారి ఉత్సవాల్లో భాగంగా నిర్వహించిన వేషధారణ పోటీల్లో ఏయూ ఉద్యోగి పీతల మురళి ప్రథమ స్థానంలో నిలిచారు. ఈ మేరకు మురళికి పోలీసు హౌసింగ్ బోర్డు కార్పొరేషన్ డైరెక్టర్ పీతల గోవింద్ గురువారం బహుమతి ప్రదానం చేశారు. గత 29 ఏళ్లలో 20 సార్లు అనేక నేల వేషధారణలతో మురళి మొదటి స్థానంలో నిలిస్తున్నట్లు ఉత్సవాల్లో పలువురు కళాకారులు వివిధ వేషధారణల్లో ఆకట్టుకున్నారన్నారు. మురళిని నగరంలోని పలువురు అభినందించారు.

బీసీ కార్పొరేషన్లకు నిధులివ్వాలి

అల్లిపురం: ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి బాధ్యతలు స్వీకరించిన నాటి నుంచి వెనుకబడిన కులాలకు అధిక ప్రాధాన్యతనిస్తున్నారని జాతీయ బీసీ సంక్షేమ సంఘం విశాఖ జిల్లా అధ్యక్షుడు డబ్బీరు కుమారస్వామి కొనియాడారు. గురువారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బీసీ సమస్యలపై సుదీర్ఘపోరాటం చేస్తున్న జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్యకు రాజ్యసభ పదవినిచ్చి గౌరవించారన్నారు. తద్వారా బీసీలు జాతీయ వేదికగా తమ గొంతు వినిపించే అవకాశం కలిగిందన్నారు. కానీ బీసీ కార్పొరేషన్లలో తగినన్ని నిధులు లేక అభివృద్ధికి నోచుకోవడం లేదన్నారు. తక్షణమే ముఖ్యమంత్రి వాటికి నిధులు విడుదల చేయాలని విజ్ఞప్తి చేశారు. అదే విధంగా రాష్ట్రంలో ఖాళీగా వున్న ప్రభుత్వ ఉద్యోగాలకు తక్షణమే నోటిఫికేషన్లు విడుదల చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో రాష్ట్ర కార్యదర్శి వారణాసి అన్నాజీరావు, జిల్లా యువజన అధ్యక్షుడు ఉద్దండరావ్ వెంకటగిరి, శ్రీరామ్ తదితరులు పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణం తొలగించండి

దాబాగార్డెన్స్: అక్రమ నిర్మాణం తొలగించాలని జీవీఎంసీ 55వ వార్డు తాటిచెట్లపాలెం రామాలయం వీధికి చెందిన చిల్లా వెంకటస్వామి జీవీఎంసీ అధికారులను కోరారు. వీజేఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో గురువారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నాగేశ్వరరావు గ్యాస్ కంపెనీ రోడ్డులోని ఒక ఇంటి యజమాని అక్రమ నిర్మాణాలు చేపడుతున్నారని జీవీఎంసీ అధికారులకు ఫిర్యాదు చేశామన్నారు. 2019 మే నెల 10వ తేదీన జీవీఎంసీ సిబ్బంది వచ్చి తొలగింపు చర్యలు చేపట్టారన్నారు. కొంత భాగం తొలగించిన అనంతరం భవన యజమానులు, బంధువులు టౌన్‌ప్లానింగ్ సిబ్బందిపై దౌర్జన్యం చేసి తొలగింపును అడ్డుకున్నారని తెలిపారు. ఈ విషయం పోలీస్ స్టేషన్ వరకు వెళ్లినా పోలీసులు ఎవరూ పట్టించుకోలేదని తెలిపారు. దీనిపై జీవీఎంసీ స్పందనలో ఫిర్యాదు చేయగా కోర్టులో కేసు ఉందని చెప్పి తొలగింపు చర్యలు నిలుపుదల చేశారన్నారు. గత మార్చి 11న కోర్టు కేసు కొట్టివేస్తూ డిక్రీ జారీ చేసిందన్నారు. ఈ నెల 2న జీవీఎంసీ స్పందనలో మళ్లీ ఫిర్యాదు చేసినా, అధికారులు స్పందించలేదని ఆరోపించారు.

అక్కరమాని ఔదార్యం


చెక్కు అందిస్తున్న అక్కరమాని వెంకటరావు

ఎంవీపీ కాలనీ: వైఎస్సార్‌సీపీ కార్యకర్త గరికిన మురళి కుటుంబానికి పార్టీ సీనియర్ నాయకుడు అక్కరమాని వెంకటరావు రూ.50 వేలు ఆర్థిక సాయం అందజేశారు. మురళి ఇటీవల మరణించడంతో అతని కుటుంబం ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతోంది. విషయం తెలుసుకున్న వెంకటరావు గురువారం మురళి కుటుంబ సభ్యులను పరామర్శించారు. అనంతరం కుటుంబ సభ్యులకు తన సొంత నిధుల నుంచి రూ.50 వేలు సాయంగా అందజేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు పుక్కళ్ల ధనలక్ష్మి, పుక్కళ్ల శంకర్, సూరాడ దాసు, తదితరులు పాల్గొన్నారు.

అచీవర్స్ డే విజయవంతంపై వీసీ హర్షం


కార్యక్రమంలో పాల్గొన్న వీసీ ప్రసాదరెడ్డి, తదితరులు

ఎంవీపీ కాలనీ: ఆంధ్ర విశ్వవిద్యాలయం ఇంజినీరింగ్ కళాశాలల జాబ్స్ అచీవర్స్ డే విజయవంతం కావడంపై వీసీ ఆచార్య ప్రసాదరెడ్డి హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమం నిర్వాహకులు, ఇంజినీరింగ్ కళాశాల ఆచార్యులు, సిబ్బంది, వలంటీర్లతో వీసీ గురువారం ఏయూ కెమికల్ ఇంజినీరింగ్ విభాగంలో సమావేశమై అభినందించారు.

ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ కళాశాల ప్రిన్సిపాల్, ఆచార్యులు, ప్లేస్‌మెంట్ అధికారి సంపూర్ణ కృషితోనే ఈ ఏడాది విద్యార్థులకు అత్యధిక ఉద్యోగాలు సాధ్యమయ్యాయన్నారు. ఇదే స్ఫూర్తితో ప్రతి ఏటా పనిచేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రెక్టార్ ఆచార్య సమత, ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య శశిభూషణరావు, మహిళా ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య ఎస్.కె.భట్టీ, పాలక మండలి సభ్యురాలు ఆచార్య శోభశ్రీ, ఆచార్య పాల్ డగ్లస్, తదితరులు పాల్గొన్నారు.

వస్త్ర దుకాణం ఎదుట మహిళ ఆందోళన


షాపు ఎదుట ఆందోళన చేస్తున్న లీలా భారతి

ఎంవీపీకాలనీ: వస్త్ర వ్యాపారంపై కుదుర్చుకున్న ఒప్పందాన్ని ఉల్లంఘించి శ్రీవాణి వస్త్ర దుకాణం యజమాని బలభద్ర వెంకటకుమార్ మోసం చేశాడంటూ లెంక లీలాభారతి అనే మహిళ ఆందోళనకు దిగిన ఘటన 3వ పట్టణ పోలీసు స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. వివరాలిలా ఉన్నాయి. విజయనగరానికి చెందిన ఫ్యాషన్ డిజైనర్ లీలాభారతి, విశాఖలోని ఆశీల్‌మెట్ట వద్ద ఉన్న శ్రీవాణి వస్త్ర దుకాణం యజమాని బలభద్ర వెంకటకుమార్ మధ్య ఒప్పందం కుదిరింది. భారతి తను రూపొందించిన వస్త్రాలను శ్రీవాణి వస్త్ర దుకాణంలో అమ్ముకునే అవకాశం కల్పించడం ఈ ఒప్పందం ఉద్దేశం. అయితే అమ్మకాల్లో దుకాణం నిర్వహణ, అద్దె నిమిత్తం 20 శాతం వెంకటకుమార్‌కు చెల్లించాల్సి ఉంది. అయితే ఈ ఒప్పందం ప్రకారం ఆయన 20 శాతం వాటా తీసుకోకుండా 32 శాతం తీసుకుంటున్నట్లు ఆమె ఆరోపించారు. దీనిపై ప్రశ్నించగా గత కొద్ది రోజులుగా తనను మానసికంగా వేధిస్తున్నట్లు భారతి వెల్లడించారు. ఈ క్రమంలో తనకు తెలియకుండా షాపులో సామాన్లను వేరే చోటికి తరలిస్తుండడంతో ఆమె ఆశీల్‌మెట్టలోని షాపు ఎదుట బైఠాయించి నిరసన తెలిపారు. ఈ అంశంపై 3వ పట్టణ పోలీసు స్టేషన్‌లో సైతం ఫిర్యాదు చేసినట్లు భారతి చెప్పారు. వెంకటకుమార్‌పై కేసు నమోదు చేసి, తనకు న్యాయం చేయాలని పోలీసులను కోరారు.

మనిషి కవి గోపి

సీతంపేట: కవిత్వం అంటే మనిషిని కలిసినట్టు ఉండాలని భావించే మహోన్నత వ్యక్తి, ప్రముఖ కవి, విమర్శకుడు ఎన్.గోపి అని పలువురు వక్తలు కొనియాడారు. విశాఖ రసజ్ఞ వేదిక ఆధ్వర్యంలో గురువారం ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో జగదీశ్వరి ఫౌండేషన్ 2020 సాహిత్య పురస్కారం ప్రదానోత్సవం జరిగింది. ముఖ్య అతిథి రచయిత వి.హర్షవర్ధన్ చేతుల మీదుగా కవి గోపికి జగదీశ్వరి పురస్కారం ప్రదానం చేశారు. ఈ సందర్భంగా విశాఖ రసజ్ఞ వేదిక వ్యవస్థాపకుడు డాక్టర్ జి.రఘురామారావు మాట్లాడుతూ మనిషి కవి గోపి అని, ఆయన రాసిన కవితా సంకలనం చదివితే ఆయన హృదయం, ఆలోచన తెలుస్తుందన్నారు. జగదీశ్వరి చారిటబుల్ ట్రస్టు వ్యవస్థాపకుడు ఎస్.రామకృష్ణ మాట్లాడుతూ పేద విద్యార్థుల చదువుకు ఆర్థిక సాయం అందించి, వారి కాళ్లపై వారి నిలబడేలా ప్రోత్సహించాలన్న ఉద్దేశంతో 2019లో ట్రస్టు స్థాపించినట్లు తెలిపారు. తన భార్య జగదీశ్వరికి సాహిత్యం, సంగీతంపై ఎంతో మక్కువని, ఆమె జ్ఞాపకార్థం ప్రతి ఏటా విశిష్ట సాహితీవేత్తలకు జగదీశ్వరి పురస్కారం ప్రదానం చేస్తున్నట్టు చెప్పారు. కార్యక్రమంలో విశాఖ రచయితల సంఘం అధ్యక్షుడు అడపా రామకృష్ణ, పలువురు సాహితీవేత్తలు పాల్గొన్నారు.

సిరులతల్లికి సహస్ర తులసీదళార్చన


సహస్ర తులసీదళార్చన సేవలో కనకమహాలక్ష్మి

దాబాగార్డెన్స్: బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మికి గురువారం సహస్ర తులసీదళార్చన ఘనంగా నిర్వహించారు. ఉదయం 8 నుంచి 9 గంటల వరకు జరిగిన ఈ పూజతోపాటు పంచామృతాభిషేక సేవ, శ్రీచక్రా నవవర్ణార్చన, లక్ష్మీ హోమంలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. తులసీదళార్చనలో పరోక్ష పద్ధతిలో పాల్గొనే ఆసక్తి గల భక్తులు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, టౌన్ కొత్తరోడ్డు శాఖ, అకౌంట్ నంబర్ 060810011006691, ఐఎఫ్ఎస్‌సీ కోడ్ యూబీఐఎన్ 806081లో చెల్లించవచ్చు.

వయోపరిమితి పెంచాలని వినతి

బీచ్ రోడ్డు: రాష్ట్ర ప్రభుత్వం తర్వలో భర్తీ చేయనున్న ఉద్యోగాల కోసం వయోపరిమితిని 47 ఏళ్లకు పెంచాలని రాష్ట్ర నిరుద్యోగ జేఏసీ అధ్యక్షుడు హేమంత్‌కుమార్ కోరారు. ఈ మేరకు గురువారం నగరానికి వచ్చిన మంత్రి బొత్స సత్యనారాయణను కలిసి వినతి పత్రం అందజేశారు. డీఎస్సీ, పాలిటెక్నికల్, ఇంటర్, డిగ్రీ కళాశాలల అధ్యాపకుల పోస్టుల భర్తీ చేపట్టి చాలా ఏళ్లు అవుతుందని, కాబట్టి వయోపరిమితిని పెంచి అందరికీ అవకాశం కల్పించాలన్నారు. దీనిపై మంత్రి సానుకూలంగా స్పందించారని హేమంత్ తెలిపారు.

నాణ్యమైన విద్య అందించడమే లక్ష్యం

డీఈవో చంద్రకళ

సింహాచలం: ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య అందించడమే లక్ష్యంగా ప్రభుత్వం పలు కార్యక్రమాలు అమలు చేస్తుందని డీఈవో చంద్రకళ అన్నారు. పెందుర్తి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో భద్రపరిచిన జగనన్న విద్యా కానుక కిట్స్ స్టాక్ పాయింట్‌ను గురువారం ఆమె పరిశీలించారు. విద్యా సంవత్సరం ప్రారంభమైన తర్వాత ఎలాంటి ఆటంకం లేకుండా కిట్స్ పంపిణీ చేయాలని సూచించారు. పాఠశాలల వారీగా విద్యార్థులకు పంపిణీ చేయాల్సిన జేవీ కిట్లు వివరాలతో రిజిస్టర్ నిర్వహించాలని ఆదేశించారు. మెరుగైన విద్య అందించేందుకు ఉపాధ్యాయులంతా కృషి చేయాలని సూచించారు. తదుపరి నాడు-నేడు రెండో దశలో ఎంపికైన పెందుర్తి ప్రభుత్వ ఉన్నత పాఠశాల, జుత్తాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, నరవ వానిపాలెం, దువ్వపాలెం, మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలు, పులగాలిపాలెం ప్రాథమికోన్నత పాఠశాలను సందర్శించారు. నరవానిపాలెం పాఠశాలలో వుయ్ లవ్ రీడింగ్‌లో భాగంగా సమ్మర్ క్యాంప్ యాక్టివిటీస్, బుక్స్ పరిశీలించారు. విద్యార్థులకు పలు సూచనలు చేశారు. అలాగే పది కాంపోనెంట్స్ పనులను జూన్ 11లో పూర్తి చేయాలని మండల విద్యాశాఖాధికారి పైడపు నాయుడును ఆదేశించారు. ఎంఈవో పైడపునాయుడు మాట్లాడుతూ పెందుర్తి మండలానికి తొలి విడతగా పాఠ్యపుస్తకాలు 19,435, నోట్ పుస్తకాలు, 59,086 వచ్చాయన్నారు. కార్యక్రమంలో నాడు-నేడు ఫీల్డ్ ఇంజినీర్ పి.పద్మ, సచివాలయ ఇంజినీరింగ్ అసిస్టెంట్లు సునీల్, బి.హరికృష్ణ, కె.రవికుమార్, ఎడ్యుకేషన్ సెక్రటరీ యశ్వంత్ తదితరులు పాల్గొన్నారు.

పూర్ణామార్కెట్ ఆశీలు పాట రద్దయ్యేనా!

- స్టాండింగ్ కమిటీకి వెళ్లిన ఫైళ్లు
- రూ.62.56 లక్షలకే పాట ముగించిన వైనం
- పాటకు ఆమోదం లభిస్తే రూ.18 లక్షలు చేతులు మారే అవకాశం


పూర్ణామార్కెట్


రామకృష్ణరైతుబజార్

జగదాంబ: అవకతవకలు చోటు చేసుకున్నట్లు విమర్శలు వినిపిస్తున్న నేపథ్యంలో పూర్ణామార్కెట్ ఆశీలు పాట రద్దయ్యేనా? అని పలువురు ఎదురు చూస్తున్నారు. జీవీఎంసీకి ఆదాయం తెచ్చిపెట్టే సర్దార్ వల్లభాయ్ పటేల్ మార్కెట్, రామకృష్ణ రైతుబజార్ మార్కెట్లకు ఈ ఏడాది జోన్-4 కార్యాలయంలో ఆశీలు పాట నిర్వహించారు. అయితే కాంట్రాక్టర్లు కుమ్మక్కు కావడంతో నాలుగు సార్లు పాట రద్దు అయింది. అయిదో సారి గతనెల 20వ తేదీన మళ్లీ పాట నిర్వహించారు. రూ.60 లక్షలుగా సర్కార్ పాట మొదలుపెట్టగా దానిని 62.56 లక్షలకు పూర్తి చేశారు. అలాగే రామకృష్ణ రైతుబజార్ మార్కెట్‌కు రూ. 15.50 లక్షలకు పాట నిర్వహించారు. అయితే ప్రతి సంవత్సరం జీవీఎంసీకి ఆదాయం వచ్చే విధంగా పాటను ఎక్కువ ధరావతు వచ్చే విధంగా ముందుకు తీసుకెళ్లాలి. అంతే కాకుండా పాట రద్దు అయితే పాటకు పాటకు మధ్య కనీసం వారం రోజుల సమయం ఉండాలి. కానీ దగ్గర దగ్గరగా పాట పెట్టడం, గత ఏడాది కంటే ఈ ఏడాది తక్కువ ధరావతుకు పాట వెళ్లడంతో పలు అనుమానాలు తలెత్తుతున్నాయి.

రూ.18 లక్షలు చేతులు మారాయా?

వాస్తవానికి జీవీఎంసీ మూడు సంవత్సరాలకు కలిపి యావరేజ్ మీద రూ. 60 లక్షలకు ఆశీలు పాట పెట్టినప్పటికీ బయట పాటదారులు కుమ్మక్కు అయిపోయారనే ప్రచారం జరుగుతోంది. తక్కువ ధరావతుకు పాట దక్కించుకున్న వ్యక్తి రెండవ పాటదారుకి రూ.18 లక్షలు ఇవ్వడానికి ఒప్పందం జరిగినట్టు తెలుస్తోంది. ఇందుకు స్టాండింగ్ కమిటీలో మంతనాలు జరుగుతున్నట్టు బయట ప్రచారం. ఇదే గనుక నిజమైతే జీవీఎంసీకి రావాల్సిన ఆదాయానికి గండి పడినట్లేనని చెప్పొచ్చు.

ఆడపిల్లల భరోసాకు సరికొత్త పథకం

- మహిళా సమ్మాన్ సేవింగ్స్‌తో 7.5 వడ్డీ
- 18 ఏళ్లు నిండిన యువతులకు లబ్ధి
- పోస్టల్ శాఖ ద్వారా అందుబాటులో..



మహిళ సమ్మాన్ సేవింగ్స్ లోగో


ఖాతాదారులకు పుస్తకాలు అందిస్తున్న సీనియర్ సూపరింటెండెంట్ రాహుల్


మహిళలకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

ఎంవీపీ కాలనీ: ఆడపిల్లల అభ్యున్నతికి పోస్టల్ శాఖ మరో సరికొత్త పథకం అందుబాటులోకి తీసుకొచ్చింది. ఇప్పటికే సుకన్య సమృద్ధి యోజన పథకంలో భాగంగా చిన్నారి ఆడపిల్లలకు బ్యాంకు సేవింగ్స్ ద్వారా అత్యధిక వడ్డీ రేటు కల్పించింది. ఇప్పుడు మహిళా సమ్మాన్ సేవింగ్స్ సర్టిఫికెట్ పథకంతో 18 ఏళ్లు పైబడిన, మైనర్ ఆడపిల్లలకు కూడా లబ్ధి చేకూరనుంది. ఇటీవల కేంద్ర ప్రభుత్వం ఈ పథకాన్ని అందుబాటులోకి తేగా తపాలా శాఖ కొద్ది రోజులుగా విస్తృత స్థాయిలో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తోంది. యువతులు ఈ పథకాన్ని వినియోగించుకుని, లబ్ధి పొందాలని సూచిస్తోంది.

పథకం ప్రయోజనాలు ఇలా..

18 ఏళ్లు నిండిన ఆడపిల్లల పేరుమీద ఈ పథకం ద్వారా సేవింగ్స్ చేయాల్సి ఉంటుంది. పోస్టల్ ఖాతా ద్వారా ఈ నిధులు జమ చేయాల్సి ఉంటుంది. రూ.1000 నుంచి గరిష్ఠంగా రూ.2 లక్షల వరకు జమ చేసుకోవచ్చు. జమ చేసిన మొత్తానికి 7.5 శాతం వడ్డీ అందిస్తారు. ఈ కొత్త పథకం ద్వారా సొమ్మును జమ చేసేందుకు ప్రభుత్వం రెండేళ్ల కాల వ్యవధి కల్పించింది. అంటే మార్చి 2025 వరకు జమ చేసేందుకు వెసులుబాటు కల్పించారు.

ఆయా ఆడపిల్లల సంరక్షకులు ఎవరైనా ఈ ఖాతాను తెరవచ్చు. వారి ఆర్థిక స్థోమతకు అనుగుణంగా 3 నెలల కాలవ్యవధిలో వారు ఎన్ని ఖాతాలైన తెరుచుకొనే వెసులుబాటు ఉంది. ఖాతాదారులు ప్రాణాంతక వ్యాధులు, ప్రమాదాలు, తీవ్ర కారణాలు ఉంటే ఖాతాను మధ్యలోనే మూసివేసేందుకు అవకాశం ఉంటుంది. అప్పుడు అసలుతో పాటు పథకం ద్వారా అందించే వడ్డీని కలిపి అందజేస్తారు.

ఆడపిల్లలకు ఆర్థిక భరోసా

ఆడపిల్లల ఆర్థిక భరోసా కల్పించడంలో ఈ పథకం మంచి ఫలితాలు ఇస్తుంది. తల్లిదండ్రులు లేదా సంరక్షకులు ఈ పథకం కింద ఖాతా తెరిచి తమ పిల్లలకు భరోసా కల్పించవచ్చు. ఇప్పటికే పెద్ద ఎత్తున ఈ ఖాతాలు తెరిచేందుకు తల్లిదండ్రులు ఆసక్తి కనబరుస్తున్నారు. అయితే పథకంపై విస్తృత ప్రచారం కోసం అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం. ఖాతాదారుల అవసరాన్ని బట్టి ఆరు నెలల కాలవ్యవధిలో ఎప్పుడైనా ఈ ఖాతాను ముగించుకోవచ్చు. అలా ముగించిన ఖాతాలకు రూ.5.5 శాతం మాత్రమే వడ్డీ లభిస్తుంది. రానున్న రోజుల్లో ఈ పథకానికి విశేష ఆదరణ లభించనుంది.

– నాగ ఆదిత్య, ఏడీ, తపాలా శాఖ రీజనల్ కార్యాలయం

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

ఆరిలోవ: కైలాసగిరి, ఇందిరానగర్ ఫీడర్ల పరిధిలో విద్యుత్ నిర్వహణ పనులు జరగనుండడంతో పలు ప్రాంతాలలో శుక్రవారం సరఫరాకు అంతరాయం కలగనుంది. కైలాసగిరి రోడ్డు, విశాలాక్షినగర్, రెవెన్యూ కాలనీ, హనుమంతవాక, ఇందిరానగర్, డెయిరీఫారం, ఆదర్శనగర్, రవీంద్రనగర్, తోటగరువు, బీఎస్ఆర్ నగర్ ప్రాంతాలలో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని ఏపీ ఈపీడీసీఎల్ జోన్-3 ఈఈ పి.శ్రీనివాసరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజలు సహకరించాలని ఆయన కోరారు.

అప్పన్నకు విశేషంగా ఆర్జిత సేవలు


అప్పన్నకు స్వర్ణపుష్పార్చన చేస్తున్న అర్చకుడు

సింహాచలం: శ్రీవరాహ లక్ష్మీనృసింహస్వామికి గురువారం ఆర్జిత సేవలు విశేషంగా జరిగాయి. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు స్వర్ణపుష్పార్చన ఘనంగా నిర్వహించారు. స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను అలంకరించి కల్యాణమండపంలోని వేదికపై అధిష్టింపజేశారు. 108 స్వర్ణసంపెంగ పుష్పాలతో స్వామికి అష్టోత్తరశతనామావళి నిర్వహించారు. పూజలో పాల్గొన్న ఉభయదాతలకు స్వామివారి శేషవస్త్రాలు, ప్రసాదం అందజేశారు. ప్రధానార్చకుడు ఇరగవరపు రమణాచార్యులు ఈపూజ నిర్వహించారు. ఆలయ ఏఈవో ఐజిరోతు శ్రీనివాసరావు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

వైభవంగా నిత్యకల్యాణం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి గురువారం నిత్యకల్యాణం విశేషంగా జరిగింది. ఆలయ కల్యాణమండపంలోని వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి,భూదేవిలను అధిష్టింపజేసి కల్యాణం శాస్త్రోక్తంగా నిర్వహించారు. పురోహిత్ అలంకారి కరి సీతారామాచార్యులు తదితరులు కార్యక్రమాన్ని నిర్వహించారు.

పబ్లిక్ డిమాండ్

మందుబాబులతో బెంబేలు


పిఠాపురం కాలనీ సర్వీసు రోడ్డు వెంబడి పడేసిన ఖాళీ మద్యం సీసాలు

మద్దిలపాలెం: చీకటి పడితే చాలు మందుబాబుల హల్‌చల్‌తో బెంబేలెత్తిపోతున్నాం. కళాభారతి రోడ్డులో కూరగాయల మార్కెట్ నుంచి ఇటు జాతీయ రహదారిని ఆనుకుని ఉన్న పిఠాపురం కాలనీ సర్వీసు రోడ్డులో రాత్రి వేళల్లో ఆకతాయిలు యథేచ్ఛగా మద్యం సేవిస్తున్నారు. దీంతో ఆ రోడ్డు మీదుగా వెళ్లాలంటే భయపడాల్సి వస్తోంది. గుంపులుగా మద్యం సేవిస్తూ హల్‌చల్ చేస్తున్నారు. ఈ రోడ్డులో మందుబాబుల ఆడగాలను కట్టడి చేయాలి.

– ఎస్.వి.ఎస్.రావు, పిఠాపురం కాలనీ